# లోపం ఎక్కడుంది?

రచన : "శ్రీకేర్"

"ఇదెంత?"

ఇరువై అయిదు రూపాయలు.

అబ్బ అంత ధరనా?

దీనికే ఇంత అవుతున్నావు గాని, బస్తీ వెళ్ళితె తెలిసేది. అక్కడ ఒక్కొక్క చీరకు నూరు, వెయ్యిలపైననే ధరుంటుంది. అక్కడ నీలాగ బేరం చేసేవారే ఉండరు. ఎంత చెపితె అంత ఇవ్వాల్సిందే. మనం ఒకవేళ బేరంచేస్తె ఎగాదిగా చూసి నవ్వుకుంటారు తెలుసా? చీరలు మడతలు పెడ్తు అంటు, నారాయణ రాజును చూస్తు ఇపుడేనా రావడం అంటు ప్రశ్నించాడు.

ఆ ఇపుడే. ఈ పల్లెటూళ్ళకు రావాలంటే బస్సు సరిగ్గా దొరకదు. దొరికినా త్రోవలో ఎక్కడ ఆగుతుందో తెలియదు. తెలిసినా ఆ వెదవ కుదుపులతో అటుఇటు ఊగి ఒళ్ళు హూనం కాగ, చివరికి దిగి మళ్ళి మూడు మైళ్ళు నడవాలి. అబ్బా బాధగా బ్యాగును కొయ్యకు తగలేసి అమ్మేది అంటు ప్రశ్నించాడు డిగ్రి చదువుతున్న రాజు.

వస్తున్నానురా అంటు వచ్చిన కాంతమ్మ రాజువైపుచూసి, అయ్యో బాబు ఎంత చిక్కిపోయావురా కొంచెం సేపు ఆలా కూర్చో నీళ్ళు కాగపెడ్తాను అంటు హడావిడిగ వెళ్ళింది.

ఏంటి నాన్న ఈ వయసులో వ్యాపారము.

ఏంటిందిరా ఎలా బ్రతుకాలి, ఏదో చిల్లర మల్లర ఖర్చులకు అంటున్న నారాయణ ఇదెంత? అంటు అడిగిన ఆమె వైపు తిరిగి ఆమెతో మాటల్లో మునిగాడు.

రాజు పరీక్షగా పరిశీలించసాగాడు.

రంగు పోతుందేమో?

ఇది పక్కా రంగు తెలుసా? బస్తీలో లైట్లు వెలుక్కు ఇది దగదగ మెరిసిపోతుంది. ఈ నలభై రూపాయల చీరనే ఏ ఎనభై లేక నూరో రూపాయలకు అమ్ముతారు.

అబ్బా బస్తీ మాటలెందుకులే, ఇంతకు ఈ చీర ఎన్నిగజాలు?

పక్కా ఎనిమిది గజాలు అంటు చీరను విప్పి వెడల్పుగ పరిచాడు.

ఈడ్చుక పోతుందేమో? చీరను క్రిందా మీదా చూస్తు అన్నదామె.

అమ్మమ్మ ఆలా ఈడుసుకపోతె నీకిస్తానా. తెల్లారితె మొఖం మొఖం చూసుకునే వాళ్ళము. ఉతికి అద్దిన చీర ఇది. ఒకవేళ రంగుపోయిన ఈడ్చుకపోయిన వాపసు తెచ్చివ్వు.

ధర ఖచ్చితంగ చెప్పు.

ఇదుగో అందరికి నలభైకిచ్చాను నీకైతె ముప్పైతొమ్మిదికిస్తాను తీసుకెళ్ళు. ఈ రంగు నీకు చాల బాగుంటుంది ఇలాంటి చీరలే మన ఎల్లమ్మ, రాజమ్మ చెరిరెండు తీసుకెళ్ళారు.

మరి అంత ధరనా? అంటు నసిగింది.

ఇదిగో మళ్ళు ఇంకో పావల తక్కువియ్యి అంటు చీరను ఆమెవైపు వేసాడు.

ముప్పైమూడుకైతె...అంటు ఆగింది.

దేవున్తోడు నేను ముప్పైఐదుకి తెచ్చాను. ఒక్క రూపాయి లాభమిచ్చి ముప్పై ఆరుకు తీసుకో. కాని అందరికి నలుభై అని చెప్పు. చీరను మడత పెడ్తు అన్నాడు నారాయణ.

ముప్పైఐదయితే తీసుకుంటాను అంటు తీసిందామె.

ముప్పైయిదున్నర.

ఊహుఁ...

అబ్బాపెద్ద ఇరకాటంలో పెట్టావే సరే తీసుకో అంటు చీరలు ఇస్తు, ఇదిగో మల్లు మీయాయనవొచ్చాక ఓ చింకి కళ్ళు మంచిది పంపియ్యి మిగతా చీరలు సర్దుతు అన్నాడు.

ఆమె చీర తీసుకొని వెళ్ళింది.

అంతవరకు వారిద్దరిని పరిశీలిస్తున్న రాజు, నాన్న దాని అసలు ధరెంత? అన్నాడు.

ఇరువై ఐదు.

అంటే ఒక్క చీరకు పదిరూపాయలా! ఎంత దోపిడి అక్కడ ఊ టోకు వర్తకులు రెండు, మూడు రూపాయలు తీసుకుంటారు. వేరే చిల్లర మల్లరటాక్సులు మూడురుపాయలకన్న ఎక్కువ పడవు. అంటే ఉత్పత్తిదారు నుండి వినియోగదారులకు చేరేలోపున దాదాపు నలుభై శాతు హెచ్చు పడ్తుంది.

ప్రతివిషయంల్లో ఉన్నదే అది. ఇదిగో ఈ గ్లాసుకళ్ళులో ఎన్ని పాల్లు నీళ్ళుచూడు అంటు చూపాడు.

అది త్రాగకుంటే నష్టమేంటి?

ఆ మాట త్రాగనివాళ్ళు సులభంగ చెపుతారు కాని అలవాటున్న వాళ్ళకు అది అసాధ్యం. కష్టపడొచ్చి ఏదో కొంచెం త్రాగుతె మనస్సుకు తృప్తి. మీరు సినిమాలు చూడొద్దంటే వింటారా? వినరు. మీరు పెట్టె ఒక్క సినిమా ఖర్చు మాకు నాల్గురోజులు సరిపోతుంది. ఇదిగో చూడు ఈ అగ్గిపెట్టె ధర అసలు పదుహేనుపైసలు కాని దీని అమ్మకం ధర ఇరువైపైసలు. ఇదొక్కటే కాదు అన్నింటికి అంతే. ఇక మనం నిజాయితిగా ఉంటే ఏంలాభం మనుగడ కష్టమౌతుంది, అంటు నిట్టూర్చాడు.

కాని అంత లాభమా?

వీళ్ళు కల్తీ చేసి సంపాదిస్తారు. అంటే వాళ్ళు మనలను దోచుకుంటున్నారు. కళ్ళులో కల్తీ, పాలల్లో కల్తీ, నూనెల్లో కల్తీ, బియ్యంల్లో కల్తీ, నీళ్ళల్లో కల్తీ కల్తీవస్తువులే కాకుండ ఇంకా పైన విపరీతమైన ధరలు. వాళ్ళు మనదగ్గర దోచుకుంటున్నారు, మేము వాళ్ళదగ్గర దోచుకుంటున్నాము. అంటే ఒకరికొకరు దోచుకుంటున్నారు. అంతా దోపిడి మయమే. ఇది ఒక చక్రంల్లా తిరుగుతుంటుంది. ఇవెలా పుట్టిందో తెలుసా? ఎలా పోతుందో తెలుసా? నేను నలభైరుపాయిలు చెప్తె ఆమె ముప్పైయిదుకు ఒప్పుకుంది ఒకవేళ నేను ముప్పైయిదుకైన ఇచ్చేవాన్నే కాని ఆమె అంతవరకే తృప్తి పడ్డది. ఒకవేళ నేను ముప్పైకే చెప్పాననుకో ఆమె ఇరువై రుపాయలకు అడుగుద్ది. నేను ఇరువై ఐదు రుపాయలని చెప్పాననుకో అసలు ధరని ఎంత ఎన్ని ప్రమాణాలు చేసినా ఆమె ఒప్పుకోదు ఏ ఇరువైకో, పదుహేనుకో అడుగుతుంది. ఆమె ఒప్పుకోదు, ఒప్పుకుంటే పదిరుపాయల నష్టం. నిజాన్ని నమ్మించడానికి నేను ఎన్ని అబద్దలాడిన నమ్మరు. కాని నేను చెప్పిన అబద్దాన్ని నమ్మించడానికి మరొక అబద్ద మాడితె చాలు నమ్మేస్తారు. ఈ లోకంలో నీతికి నీడ లేదు. ఆ నీతి అవినీతిని చూస్తేచాలు ఆమడదూరం పరుగెత్తుతుంది. ఈ అవినీతి ఇలా పెరగడానికి లోపం ఏమిటో? అది ఎందుకు, ఎక్కడ ఎవరు పుట్టించారు? దీన్ని ఆపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నా పలితం కనపడక పోవడానికి ఎక్కడ లోపముందో తెలుసా?

ఒక్కొక్క ప్రశ్న మెదడుకు కుత పెడ్తున్న లోపమెక్కడుందో? తెలియక ఆలోచనలతో సతమతమైపోతున్నాడు రాజు.

కాంతమ్మ స్నానానికి రమ్మని పిలవగ యాంత్రికంగా మారిన మనుషులతో పాటు లోకం కూడ మారిందని ఒక నిట్టూర్పు విడిచి లేచాడు.